జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 31 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 7

## క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను స్వీకరించాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్.
- ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్న గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులు.
- హోరాహోరీగా సాగిన వాలీబాల్, షటిల్, క్యారమ్స్ పోటీలు



**పాల్వంచ, ఆగస్టు 30, ప్రజాజ్యోతి:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా పోటీలు చివరి రోజు కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఉత్సాహభరితంగా కొనసాగాయి. జిల్లా క్రీడల అధికారి బి. గోపాల్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

మిగతా 2 లో...

# తలొగ్గలేక తప్పుకున్నారు...

7 లో..

# తలొగ్గి పరువు తీశారు..






- నాటి శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి 'ఆత్మగౌరవ త్యాగాలు' ఎక్కడ?
- నేటి సూర్యనారాయణ, లలిత్ 'లొంగుబాటు నాటకాలు' ఎక్కడ?
- అధికారిక వేదికలు వదిలి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో సింగరేణి సమీక్షలేంటి?
- నిబంధనల ఉల్లంఘనపై అధికారుల సీడీఏ రూల్స్ ఏం చెబుతున్నాయి?
- పొలిటికల్ జోక్యాలకు తలొగ్గిన అధికారులపై తక్షణమే చర్యలకు నిలదీతలు!

రాష్ట్రానికి వెలుగులు పంచే దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఉన్నతాధికార స్థానం అంటే కేవలం బాధ్యతలు నిర్వహించడం మాత్రమే కాదు.. అది వేలాది మంది కార్మికుల నమ్మకం, 137 ఏళ్ల సంస్థాగత స్వయంప్రతిపత్తి! కానీ నేడు ఆ అత్యున్నత అధికార హోదాను పొలిటికల్ లీడర్ల ముంగిట తాకట్టు పెడుతున్న తీరు నల్లబంగారు సామ్రాజ్యంలో తీవ్ర దుమారాన్ని రేపుతోంది.

● భద్రాద్రి కొత్తగూడెం / సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి

## నక్సలైట్ల పాత ఆయుధ డంప్ స్వాధీనం

- భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల స్వాధీనం

2 లో...



## పాల్వంచలో 'సెల్ఫ్ డ్రైవ్' ట్రావెల్స్ దందా

2 లో..

- ట్రావెల్స్ రిజిస్ట్రేషన్ లేని కార్లతో అక్రమ వ్యాపారం
- ప్రభుత్వ ఆదాయానికి గండి, టాక్సీ డ్రైవర్లకు తీవ్ర నష్టం
- 30కి పైగా వాహనాలు. రోజుకు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు వసూళ్ల ఆరోపణలు
- పన్నులు, పర్మిట్లకు ఎగనామా..?
- అధికారుల నిఘా ఎక్కడ?

పాల్వంచ పట్టణంలో ఇటీవల 'సెల్ఫ్ డ్రైవ్' పేరుతో అక్రమంగా నడుస్తున్న ట్రావెల్స్ వ్యాపారం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఓ కేటీపీఎస్ ఉద్యోగి ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా భారీ స్థాయిలో కార్ల అద్దె వ్యాపారం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– పాల్వంచ, ప్రజాజ్యోతి



## క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను స్వీకరించాలి



(మొదటి పేజీ తరువాయి...)

బి. రాహుల్ ఐఏఎస్, డిప్యూటీ డైరెక్టర్ ముఖతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి రాహుల్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం గతంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించిన సందర్భాలు అరుదని, ప్రస్తుతం ప్రాజెక్టు అధికారి చొరవతో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

**హోరాహోరీగా పోటీలు**

వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉత్కంఠభరితంగా జరిగిన పోటీల్లో ఏకలవ్య జట్టు విజేతగా, భద్రాచలం జట్టు రన్నరప్‌గా నిలిచింది. అదే విధంగా షటిల్, క్యారమ్స్ పోటీల్లో ఏటీడీఓ దమ్మపేట జట్టు ప్రథమ స్థానాన్ని, భద్రాచలం జట్టు ద్వితీయ స్థానాన్నికైవసం చేసుకుంది. అనంతరం వివిధ క్రీడా విభాగాల్లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రాజెక్టు అధికారి రాహుల్ తదితరులు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓలు ఎస్. చంద్రమోహన్, ఇల్లందు భారతీదేవి, భద్రాచలం రాధమ్మ, కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ హెచ్ఎం ఎన్. చందు, పీఈటీలు, పీడీలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నక్సలైట్ల పాత ఆయుధ డంప్ స్వాధీనం





**చర్ల, ఆగస్టు 30:(ప్రజా జ్యోతి):** నక్సల్ కార్యకలాపాల నిర్మూలనలో భాగంగా నారాయణ్‌పూర్ జిల్లాలో భద్రతా దళాలు కీలక విజయం సాధించాయి. నారాయణ్‌పూర్ పోలీసులు, బీఎస్ఎఫ్ సంయుక్తంగా నిర్వహించిన గాలింపు చర్యల్లో అదానార్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో నక్సలైట్లు గతంలో దాచి పెట్టిన పాత ఆయుధ డంప్‌ను గుర్తించి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ సూపరింటెండెంట్ సందీప్ కుమార్ పటేల్, 129వ బెటాలియన్ బీఎస్ఎఫ్ కమాండెంట్ ముఖేష్ కుమార్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) అక్షయ్ సబ్ద్రి మార్గదర్శకత్వంలో భద్రతా బలగాలు జిల్లాలోని మారుమూల, అటవీ ప్రాంతాల్లో నిరంతరం గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా ఆగస్టు 29న అదానార్ గ్రామానికి వాయువ్య దిశలోని అడవుల్లో నిర్వహించిన గాలింపులో ఈ పాత నక్సలైట్ డంప్ బయటపడింది. డంప్‌లో ఒక .303 రైఫిల్, నాలుగు .315 రైఫిళ్లు, ఐదు 12 బోర్ రైఫిళ్లు, రెండు బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, ఒక టెలిస్కోపిక్ సైట్, 13 బీజీఎల్ షెల్స్, 16 12 బోర్ కాట్రిడ్జులు, సుమారు రెండు కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. నక్సల్ కార్యకలాపాలు తగ్గిపోయిన ప్రాంతాల్లోనూ భద్రతా దళాలు గాలింపు, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి. గతంలో నక్సలైట్లు అడవులు, దుర్గమ ప్రాంతాల్లో దాచిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల డంప్‌లను గుర్తించి పూర్తిగా తొలగించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ సంయుక్త ఆపరేషన్లతో జిల్లాలో భద్రత మరింత పటిష్టమవుతోందని అధికారులు తెలిపారు.

# పాల్వంచలో 'సెల్ఫ్ డ్రైవ్' ట్రావెల్స్ దందా

- ట్రావెల్స్ రిజిస్ట్రేషన్ లేని కార్లతో అక్రమ వ్యాపారం
- ప్రభుత్వ ఆదాయానికి గండి, టాక్సీ డ్రైవర్లకు తీవ్ర నష్టం
- 30కి పైగా వాహనాలు. రోజుకు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు వసూళ్ల ఆరోపణలు
- పన్నులు, పర్మిట్లకు ఎగనామా..?
- అధికారుల నిఘా ఎక్కడ?



**పాల్వంచ పట్టణంలో ఇటీవల 'సెల్ఫ్ డ్రైవ్' పేరుతో అక్రమంగా నడుస్తున్న ట్రావెల్స్ వ్యాపారం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఓ కేటీపీఎస్ ఉద్యోగి ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా భారీ స్థాయిలో కార్ల అద్దె వ్యాపారం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

**- పాల్వంచ, ప్రజాజ్యోతి**

సరైన కమర్షియల్ రిజిస్ట్రేషన్ లేకుండానే వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసిన కార్లను సెల్ఫ్ డ్రైవ్ పేరుతో అద్దెకు ఇస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు, టాక్సీ డ్రైవర్లు మండిపడుతున్నారు.

**'సెల్ఫ్ డ్రైవ్' పేరుతో అసలు దందా ఇదేనా?**

పాల్వంచలో ఈ ట్రావెల్స్ సంస్థకు ఎలాంటి అధికారిక కార్యాలయం లేకుండా ఇంటి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తూ కార్ల అద్దె దందా సాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత రవాణా శాఖ అనుమతులు, కమర్షియల్ పర్మిట్లు లేకుండానే ట్రావెల్స్ సేవలు అందించడం చట్టవిరుద్ధమని తెలిసినా, ఎలాంటి భయం లేకుండా ఈ వ్యవహారం కొనసాగుతుండటం అనుమానాలకు తావిస్తోంది.

**రోజుకు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు?**

సెల్ఫ్ డ్రైవ్ పేరుతో ప్రజల నుంచి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఒక్క కారును రోజువారీ అద్దెకు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారని, కారు మోడల్, వినియోగ సమయం, ప్రయాణ దూరం వంటి కారణాలతో అదనపు ఛార్జీలు విధిస్తూ వినియోగదారులపై ఆర్థిక భారం మోపుతున్నట్లు చెబుతున్నారు.

**30కి పైగా కార్లు.. అధికారుల దృష్టికి రాలేదా?**

ఈ ట్రావెల్స్ యజమాని వద్ద దాదాపు 30కి పైగా కార్లు ఉండగా, అవన్నీ సెల్ఫ్ డ్రైవ్ పేరుతో కమర్షియల్ వినియోగానికి అద్దెకు వెళ్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు . అయితే వీటిలో చాలా వాహనాలు వ్యక్తిగత రిజిస్ట్రేషన్‌తో కొనుగోలు చేసినవేనని, కానీ పూర్తిగా కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**వైట్ నంబర్ ప్లేట్లపై అనుమానాలు**

పన్నుల నుంచి తప్పించుకోవడానికే వైట్ నంబర్ ప్లేట్ కార్లను కమర్షియల్‌గా నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కమర్షియల్ వాహనాలకు వర్తించే పర్మిట్ ఫీజులు, రోడ్డు పన్నులు, బీమా నిబంధనలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు వంటి వాటిని తప్పించుకునేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

**కొత్త మోడల్ కార్లే లక్ష్యంగా..**

మార్కెట్లోకి కొత్త మోడల్ కారు వచ్చిన వెంటనే కొనుగోలు చేసి అద్దె మార్కెట్లోకి దింపడం ఈ వ్యాపారంలో ప్రత్యేకతగా మారిందని సమాచారం. వినియోగదారులను ఆకర్షించేందుకు లేటెస్ట్ మోడల్ కార్లను అందుబాటులో ఉంచుతున్నారని తెలుస్తోంది.

**జీపీఎస్‌తో పర్యవేక్షణ?**

అన్ని కార్లలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ అమర్చినట్లు, అద్దెకు తీసుకున్న వాహనం ఎక్కడ ఉందో నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణయించిన సమయానికి కారు తిరిగి ఇవ్వకపోతే అదనపు చార్జీలు విధిస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు.

**సెక్యూరిటీగా బైక్.. ముందస్తు చెల్లింపు**

ఇక కారును అద్దెకు తీసుకోవాలంటే సెక్యూరిటీ పేరుతో వినియోగదారుల బైక్‌ను అక్కడే ఉంచాల్సిన పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు. అంతేకాకుండా అద్దె మొత్తాన్ని ముందుగానే పూర్తిగా వసూలు చేయడం కూడా వినియోగదారులపై ఒత్తిడిగా మారిందని అంటున్నారు.

**టాక్సీ డ్రైవర్లకు నష్టం**

ఈ అక్రమ వ్యాపారం కారణంగా చట్టబద్ధంగా టాక్సీ సేవలు అందిస్తున్న డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నట్లు టాక్సీ డ్రైవర్స్ యూనియన్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. అన్ని పన్నులు చెల్లిస్తూ, నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేస్తున్న తమకు ఇలాంటి అక్రమ ట్రావెల్స్ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

టాక్సీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యాపారం చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

**అధికారుల తనిఖీలకు డిమాండ్**

ఈ అక్రమ ట్రావెల్స్ దందా కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయం కోల్పోతున్నదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ, పోలీస్ శాఖ, సంబంధిత అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా నడుస్తున్న సెల్ఫ్ డ్రైవ్ ట్రావెల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ దందాకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడుతున్నారు.

# అర్ధరాత్రి ఇసుక లారీ పట్టివేత

**అశ్వరావుపేట,ఆగస్టు ప్రజా జ్యోతి :** ఇసుక అక్రమ రవాణాపై ప్రజా జ్యోతి వరుస కథనాల ప్రభావమా? శనివారం అర్ధరాత్రి గణేష్ పాడ్ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అనుమానిస్తున్న ఓ టిప్పర్‌ను స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్న ఘటన ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.అర్ధరాత్రి సమయంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు కనిపించిన ఇసుక టిప్పర్... ఇదే మార్గాల్లో నిరంతరం విధులు నిర్వహిస్తున్న స్థానిక పోలీసులకు ఎందుకు కనిపించలేదన్న ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది. ఇసుక అక్రమ రవాణాపై తరచూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ ఘటన మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.



**స్పెషల్ బ్రాంచ్‌కు సమాచారం... స్థానిక పోలీసులకు లేదా?**

గణేష్ పాడ్ ప్రాంతంలో అర్ధరాత్రి ఇసుక టిప్పర్‌ను స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది గుర్తించి పట్టుకోవడం సంచలనంగా మారింది. అయితే ఇసుక రవాణా జరిగే మార్గాలపై స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం ఎందుకు అందలేదనే ప్రశ్న తలెత్తుతోంది.

**పట్టుకున్నది ఒక్కటేనా... ఇంకా ఎన్ని వాహనాలు?**

అక్రమ ఇసుక రవాణా ఒక్క టిప్పర్‌కే పరిమితమా? లేక రాత్రి వేళల్లో మరిన్ని వాహనాలు ఇసుకను తరలిస్తున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత శాఖలు ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, పట్టుబడిన వాహనం ఎక్కడి నుంచి ఇసుకను తీసుకొచ్చింది, ఎక్కడికి తరలిస్తోంది, అనుమతులు ఉన్నాయా లేదా అనే వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**లోకల్ పోలీసులపై ప్రశ్నల వర్షం....**

స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అర్ధరాత్రి వెళ్లి టిప్పర్‌ను గుర్తించగలిగితే, స్థానికంగా నిత్యం పెట్రోలింగ్ నిర్వహించే పోలీసులకు ఇలాంటి అక్రమ రవాణా ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాపై స్థానిక పోలీసుల నిఘా వ్యవస్థ ఎంత మేర పనిచేస్తోందన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**"అర్ధరాత్రి స్పెషల్ బ్రాంచ్‌కు కనిపించిన ఇసుక టిప్పర్... లోకల్ పోలీసుల కళ్లకు ఎందుకు కనిపించలేదు?"**

ఇసుక అక్రమ రవాణా వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పట్టుబడిన టిప్పర్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు, రవాణాలో నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజా జ్యోతి ప్రశ్నిస్తోంది...**

**అర్ధరాత్రి టిప్పర్ ఎక్కడి నుంచి వచ్చింది?**
**ఇసుకకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా?**
**స్పెషల్ బ్రాంచ్‌కు దొరికిన వాహనం లోకల్ పోలీసులకు ఎందుకు దొరకలేదు?**
**ఇదే మార్గంలో గతంలో కూడా ఇసుక రవాణా జరిగిందా?**
**పట్టుబడిన ఘటనపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**
**ఇసుక దందాపై నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర విచారణ తప్పనిసరి. ప్రజా జ్యోతి ఈ వ్యవహారంపై నిఘా కొనసాగిస్తుంది.**

## గిరిజన సమస్యలపై 48 గంటల దీక్ష

**చర్ల, ఆగస్టు 30 :(ప్రజా జ్యోతి):** సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించనున్న 48 గంటల రిలే నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను గొండ్వాన సంక్షేమ పరిషత్ నాయకులు ఆదివారం పెద్దమిడిసిలేరు గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గొండ్వాన సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు బీరబోయిన శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీల ప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించనున్న 48 గంటల రిలే నిరాహార దీక్షలో ఆదివాసీ యువతీ యువకులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జీవో నంబర్ 3 స్థానంలో కొత్త జీవోను తీసుకువచ్చి రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేసి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు కింద దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని ప్రభుత్వ భూములకు ఎల్‌టీఆర్ 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులకు లక్షల రూపాయల నష్టపరిహారం అందిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘ నాయకులు, కార్యకర్తలు కలిసి 48 గంటల దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇర్ప అంజిబాబు, మండల ప్రధాన కార్యదర్శి కాయం శ్రీనివాస్, బీరబోయిన జగపతి, బెండబోయిన కౌశిక్, కుర్సం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- **కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే తాటి**

**ములకలపల్లి ఆగస్టు 30 (ప్రజాజ్యోతి ):** మండలంలోని చౌటుగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి యువతి శిరీష హైదరాబాద్ తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుప త్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శిరీష మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఘటనకు ముందు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై లోతుగా విచారణ చేపట్టి, మృతికి అసలు కారణాన్ని నిగ్గు తేల్చాల ని అన్నారు. దర్యాప్తులో ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగం కోసం స్వగ్రామానికి దూరంగా వెళ్లిన ఆదివాసి యువతి అనుమానాస్పదంగా మృతి చెందడం ఆందోళన కలిగించే విష యమని తాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో వారి భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. శిరీష కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వారికి అండగా నిలవాలని కోరారు. శిరీష మృతికి సంబంధించిన అనుమానాలను నివృత్తి చేసి కుటుంబానికి న్యా యం జరిగేలా చర్యలు తీసుకోవాలని తాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.



## శిరీష మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- **బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి: మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు**

**దమ్మపేట, ఆగస్టు 30(ప్రజాజ్యోతి ):** ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ములక లపల్లి మండలానికి చెందిన ఆదివాసి యువతి ఉకే శిరీషకు సంబంధించిన విషాద ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఘటనపై ఎలాంటి సందేహాల కు తావులేకుండా అన్ని కోణాల్లో విచారణ జరపాలన్నారు. ఉద్యోగం కోసం నగరానికి వెళ్లిన యువతికి ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం బాధాకరమన్నారు. మహిళల భద్రతపై కుటుంబాల్లో ఆందోళన నెలకొనకుండా ప్రభుత్వం, పోలీసు శాఖ తగిన చర్యలు చేపట్టాలని కోరారు.ఘటనకు సంబంధించిన వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నాలకు తావివ్వరాదని, దర్యాప్తులో బాధ్యులుగా తేలిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు వారి తరపున పోరాడతామని తెలిపారు. ఉద్యోగాలు, విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే మహిళలకు సురక్షిత వాతావర ణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.



## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 30 , (ప్రజా జ్యోతి)** నేడు సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజలు తమ తమ సమస్యలకు సంబం ధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు, అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలంసబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం ఆర్డీవోకార్యాలయంలో,జిల్లాలోని అన్నీ మండల పరిషత్ కార్యాలయాలలో ప్రజావాణి నిర్వహించబడుతుందని తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## కోటమ్మతల్లి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే తాటి





**ములకలపల్లి ఆగస్టు 30 (ప్రజాజ్యోతి ):** మండలంలోని నరసాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కోటమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మరీదు చెన్నారావు–హైమావతి దంపతుల కుమారుడు రాంసురేష్, అశ్విని వివాహ వేడుకలో తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, నూతన వస్త్రాలను అందజేశారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మరీదు నాగు, రాజారావు, మోహన్‌రావు, యర్రగొర్ల చెన్నారావు, మరీదు చెన్నారావు, ప్రసాద్, పామర్తి హరిబాబు, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

**చర్ల, ఆగస్టు 30: (ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని గణేష్‌నగర్‌లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం వైభవంగా అంకురార్పణ చేశారు. వచ్చే నెల 14న నిర్వహించనున్న వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ఉదయం 10.55 గంటలకు సుముహూర్తంలో పసుపు రాట వేసి పందిరి ముహూర్త కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. ప్రముఖ పండితులు, మొగళ్లపల్లి రామాలయ అర్చకులు పెనుమర్తి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన పూజా కార్యక్రమాలతో గణేష్‌నగర్‌లో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గణేష్‌నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు.



## ఆత్మీయుల బంధం.. మిత్రుల జ్ఞాపకం

- ఆత్మీయుల కుటుంబాలను పరామర్శ... తుమ్మల ఓదార్పు
- మిత్రుడి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి తుమ్మల





**దమ్మపేట, ఆగస్టు 30(ప్రజాజ్యోతి):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన నరుకుళ్ళ సుబ్బారావు కుటుంబ సభ్యులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా స్వర్గీయ సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల సీనియర్ నాయకులు, గ్రామ ప్రజలు, తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.అనంతరం పశ్చిమగోదావరి జిల్లా కామవరపుకోట మండలం గుంటుపల్లి గ్రామంలో తనకు అత్యంత ఆత్మీయులైన సమీప బంధువు కంఠమనేని చిన్నసత్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మంత్రి తుమ్మల పరామర్శించారు. స్వర్గీయ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మలతో పాటు సీనియర్ టీడీపీ నాయకులు గంటా మురళి, గ్రామస్తులు, కామవరపుకోట ప్రాంతానికి చెందిన తుమ్మల అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆత్మీయ మిత్రుడైన స్వర్గీయ పెండ్యాల కృష్ణబాబు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.ఒకే పర్యటనలో ఆత్మీయుల కుటుంబాలను పరామర్శిస్తూ, తన సన్నిహితులతో ఉన్న అనుబంధాన్ని చాటుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## బీరప్ప–కామరతి దేవతలకు బోనాలు

- భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన కురుమ మహిళలు

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 30 (ప్రజా జ్యోతి):** శ్రావణ మాసం సందర్భంగా అన్నపురెడ్డిపల్లి మండలంలోని రాజపురం గ్రామంలో బీరప్ప–కామరతి దేవాలయంలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గ్రామానికి చెందిన కురుమలు తమ ఆరాధ్య దైవాలైన బీరప్ప, కామరతి దేవతలకు బోనం సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కురుమ మహిళలు, భక్తులు బోనాలు ఎత్తుకుని డప్పు దరువులతో, సంప్రదాయ నృత్యాలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతనంగా నిర్మించిన బీరప్ప–కామరతి దేవాలయంలో తొలి శ్రావణ మాసం బోనం కార్యక్రమం కావడంతో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.ఈ కార్యక్రమంలో దండి రాము, చింతల కేశవులు, బన్నె ఎసుబాబు, రామారావు, అప్పయ్య, సత్యం, శ్రీను, శశి, వెంకటేశ్వరరావు, కృష్ణ, వేణు, ప్రసాద్, సుధాకర్, వెంకటేష్, లక్ష్మణ్, వెంకన్న, సాత్విక్, సూర్య గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.





# ఎనిమిది కేజీల టిఫిన్ బాంబుల స్వాధీనం

- సుక్మాలో మావోయిస్టుల డంప్ గుర్తింపు
- ఆయుధాలు ,పేలుడు పదార్థాలు స్వాధీనం





**చర్ల , ఆగస్టు 30(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో నక్సల్స్ నిర్మూలన చర్యల్లో భాగంగా భద్రతా బలగాలు భారీగా పేలుడు పదార్థాలు, ఐఈడీల తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కోంటా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెల్‌పోచ్చా గ్రామం నుంచి గోమ్‌పాడ్ వైపు వెళ్లే మార్గానికి సమీపంలోని దట్టమైన అటవీ, కొండ ప్రాంతంలో ఈ డంప్‌ను గుర్తించారు. లొంగిపోయిన నక్సలైట్ల నుంచి అందిన ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఆదివారం జిల్లా బలగాలు, డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ సంయుక్తంగా ఏరియా డామినేషన్, సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఉదయం సుమారు 11 గంటల సమయంలో నక్సల్స్ గతంలో దాచిపెట్టిన డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డంప్‌లో 4 బండిళ్ల కోడెక్స్ వైర్, 10 డెటోనేటర్లు, 17 జిలేటిన్ కడ్డీలు, ఒక బండిల్ ఫ్యూజ్ వైర్, 3 బండిళ్ల కరెంట్ వైర్, రెండు వైర్ లేని టిఫిన్ బాంబులు (ఐఈడీలు) లభించాయి. వీటితో పాటు రెండు స్టీల్ టిఫిన్లు,రెండు ప్లాస్టిక్ డస్ట్‌బిన్లు, ఒక బ్యాటరీ తదితర నక్సల్స్ ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న రెండు టిఫిన్ బాంబుల్లో ఒకటి 5 కిలోలు, మరొకటి 3 కిలోల బరువు ఉండగా, రెండింటి మొత్తం బరువు 8 కిలోలుగా పోలీసులు తెలిపారు. డంప్‌ను సురక్షితంగా స్వాధీనం చేసుకుని నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నారు.సుక్మా ఎస్పీ మయాంక్ గుర్జర్, అదనపు ఎస్పీ (నక్సల్ ఆప్స్) రోహిత్ షా మార్గదర్శకత్వంలో ఈ సంయుక్త ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు, అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించేందుకు అడవులు, దుర్గమ ప్రాంతాల్లో నక్సల్స్ దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాల డంప్‌లను గుర్తించేందుకు సెర్చింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.

## భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలు

- అశ్వాపురంలో వెల్లివిరిసిన ముస్లిం సోదరుల ఐక్యత
- జామా మసీదు నుంచి గౌతమినగర్ వరకు ఘనంగా ర్యాలీ

**అశ్వాపురం, ఆగస్టు 30, ప్రజాజ్యోతి**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అశ్వాపురం జామా మసీదు కమిటీ, మిలాద్–ఉన్–నబీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.జామా మసీదు ఆవరణంలో ప్రత్యేక ప్రార్థనలు, ఫాతియా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన బోధనలు, ఆదర్శాలను స్మరించుకున్నారు. మతగురువులు ప్రవక్త మహమ్మద్ జీవిత విశేషాలను, ఆయన మానవాళికి అందించిన సందేశాలను వివరించారు. ప్రేమ, సోదరభావం, దయ, కరుణ, పరస్పర సహకారం వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.ప్రార్థనల అనంతరం జామా మసీదు నుంచి భారీ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ అంబేద్కర్ సెంటర్ మీదుగా గౌతమినగర్ కాలనీ గేటు వరకు కొనసాగింది. ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని ప్రవక్త మహమ్మద్ సందేశాలను ప్రజలకు చాటిచెప్పారు. ర్యాలీ మొత్తం భక్తి వాతావరణం నెలకొంది. యువత, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మతగురువు నసీర్ సుభాని మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ఎవరైనా ఆపదలో ఉంటే మానవత్వంతో స్పందించి వారికి అండగా నిలవాలని సూచించారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, పేదలను ఆదుకోవడం, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అన్నారు.మతం, కులం, ప్రాంతం అనే భేదాలు లేకుండా తోటి మనుషుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని ఆయన సూచించారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.మిలాద్–ఉన్–నబీ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని ముస్లిం కుటుంబాలు, ర్యాలీలో పాల్గొన్న వారికి నిర్వాహకుల ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మతగురువులు, మతపెద్దలు, జామా మసీదు కమిటీ సభ్యులు, మిలాద్–ఉన్–నబీ కమిటీ ప్రతినిధులు, యువత, మహిళలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వేడుకల సందర్భంగా అశ్వాపురం మండల కేంద్రంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మిలాద్–ఉన్–నబీ పండుగను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించడం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, మానవత్వం మరింత పెంపొందించడమే ఇలాంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు.




## వివాహ వేడుకల్లో పాల్గొన్న బత్తుల అంజి



**ములకలపల్లి, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి):** మండలంలోని జగన్నాధపురం పంచాయతీ పరిధి నర్సాపురం కోటెమ్మ గుడి వద్ద జరిగిన పంచాయతీ కార్మికుడు మరీదు రాం సురేష్ వివాహ వేడుకలో భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి హాజరై నూతన దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జగన్నాధపురం సర్పంచ్ కుంజా వినోద్, పంచాయతీ మాజీ కార్యదర్శి ఇబ్రహీం, మండల ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ సురభి రాజేష్, ఎన్ఎస్‌యూఐ ములకలపల్లి మండల అధ్యక్షుడు, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్, గుంట్రు సాయి, వార్డు సభ్యురాలు సున్నం మంగమ్మ, మండల కాంగ్రెస్ నాయకులు చేకూరి రామాచారి, వాడే శేషగిరి, సున్నం నాగేష్, వెలకం వెంకటేష్, నవీన్ తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా ముత్యాలమ్మ బోనాల వేడుకలు



**చర్ల, ఆగస్టు 30: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం తెగడ గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో బోనాల వేడుకలను ఆదివారం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు మేళతాళాల నడుమ బోనాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. గ్రామ పెద్దలు, మహిళలు, పిల్లలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తొలి బోనాన్ని అమ్మవారికి ప్రసాదంగా ఏరుకొండ నాగముత్యం ఏర్పాటు చేసి సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# ఎదురెదురుగా ఢీకొన్న బైకులు.. యువకుడు మృతి

- మొండికుంట సాయిబాబా ఆలయం సమీపంలో విషాదం.. మల్లెలమడుగు వాసి వసంత్ (40) అక్కడికక్కడే మృతి





**అశ్వాపురం, ఆగస్ట్ 30,ప్రజాజ్యోతి:** మండల పరిధిలోని మొండికుంట సాయిబాబా ఆలయం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మల్లెలమడుగు గ్రామానికి చెందిన వసంత్ (40) అక్కడికక్కడే మృతి చెందాడు.స్థానికుల వివరాల ప్రకారం.. వసంత్ తన ద్విచక్ర వాహనంపై మొండికుంట నుంచి కొత్త గూడెం వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో కొత్తగూడెం వైపు నుంచి మరో ద్విచక్ర వాహనం, బుల్లెట్ వేగంగా వస్తుండగా మొండికుంట సాయిబాబా ఆలయం సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు వసంత్ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు, మరో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తి పరిస్థితిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.వసంత్ మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అప్పటి వరకు తమతో ఉన్న వ్యక్తి ఒక్కసారిగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.మొండికుంట–కొత్తగూడెం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని స్థానికులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వేగాన్ని నియంత్రించుకోవడంతో పాటు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని కోరుతున్నారు. రహదారిపై ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పూసపల్లి ఓసిని త్వరితగతిన ప్రారంభించాలి



**ఇల్లందు, ఆగస్ట్ 30 (ప్రజా జ్యోతి)** సింగరేణి కి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియాలో జెకె ఓసి పొడగింపు ప్రాజెక్ట్ (పూసపల్లి ఓసి) ని యాజమాన్యం కాలయాపన చేయకుండా త్వరితగతిన ప్రారంభించాలని ఐఎన్టియుసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ అన్నారు. ఆదివారం స్థానిక సింగరేణి గెస్ట్ హౌస్ లో ఐఎన్టియుసీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశం ఆయన మాట్లాడుతూ సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా కనుమరుగు కావద్దనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం, తమ యూనియన్ సహకారంతో సింగరేణి చొరవతో పూసపల్లి ఓసికి అన్ని రకాల అనుమతులు వచ్చేందుకు కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఐఎన్టీయుసీ వల్ల పూసపల్లి ఓసికి అన్ని రకాల అనుమతులు వస్తే తమ సంఘం ఆధ్వర్యంలోనే అనుమతులు సాధ్యమైందని ఏఐటీయుసి గొప్పలు చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు. గుర్తింపు సంఘంగా ఏఐటియుసి కార్మికులకు ఏమి చేసిందో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో సింగరేణి చొరవతో తమ యూనియన్ సెక్రటరీ జనరల్, మినిమం వేజ్ బోర్డ్ కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో సింగరేణిలో కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తూ, కార్మికుల పక్షాన నిలిచిన ఏకైక యూనియన్ ఐఎన్టియుసి అని స్పష్టం చేశారు. సింగరేణి కోల్డ్ బెల్ట్ ఏరియాలో ఆయా ప్రాంత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల వల్లనే కార్మికుల ఎదుర్కొంటున్న ప్రతి ఒక్క సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఐఎన్టీయూసీ యూనియన్ పై ఎవరు ఎన్ని అసత్య ఆరోపణలు చేసిన కార్మికులు నమ్మే పరిస్థితిలో లేరని, అలాంటి ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా పూసపల్లి ఓసిని త్వరగా ప్రారంభించాలని జియం, అధికారులను కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి కేంద్ర కమిటీ నాయకులు గోచికొండ సత్యనారాయణ, భూక్యా నాగేశ్వరరావు, మహబూబ్, నాయకులు అన్వర్, బాబురావు, అభిషేక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ఏరియాలలో1/70 చట్టాన్ని అమలు చేయాలి

- రాజ్యాంగం కల్పించిన 5 వ షెడ్యూల్ ని రక్షించాలి
- రాజకీయాలకి అతీతంగా ఆదివాసి చట్టాల్ని కాపాడాలి
- అధికారులు_ ప్రజాప్రతినిధులు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు
- ఆదివాసి చట్టాల పరిరక్షణ కమిటీ డాక్టర్ మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య,
- సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ కెచ్చల రంగారెడ్డి డిమాండ్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 30,(ప్రజాజ్యోతి)**ఏజెన్సీ ఏరియాలలో 1/70 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ చందా లింగయ్య, సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డి లు డిమాండ్ చేశారు, ఆదివారం భద్రాచలంలోని గిరిజన భవన్ లో పూనం వీరభద్రం ఆదివాసి అభ్యుదయ సంఘం అడ్వైజర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలోని ఏజెన్సీ చట్టాల్ని నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు, మరికొందరు వ్యక్తులు కుట్ర ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు, తెలంగాణ రాష్ట్రంలో , దేశంలో ఆదివాసీల సంప్రదాయాలను ప్రత్యేకతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే అని అన్నారు, గత ప్రభుత్వంలో అనేక సందర్భాల లో 1/70 చట్టాన్ని తీసివేయడం కోసం అనేక కుట్రపూరిత ప్రయత్నం చేసినప్పటికీ ఆదివాసీలు ఐక్యతతో పోరాటం చేశారన్నారు, అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా చందా లింగయ్య ,గిరిజన సంఘాలు అన్నీ కలిసి చట్టాన్ని కాపాడుకుంటూ వచ్చారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగంలో ఆదివాసుల కోసం ప్రత్యేకంగా చట్టాల్ని రూపొందించిన వాటిని కాపాడుకోవాలంటే అనేక పోరాటాలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో చట్టాన్ని నిర్వీర్యం చేసి కొంతమంది బడాబాబులు వాళ్ల పెత్తందారితనాన్ని పెంపొందించుకోవడం కోసం ఆదివాసి చట్టాలను అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సందర్భంలో ఏజెన్సీ జిల్లాలలో 1/70 చట్టం అమలు చేయొద్దని జీవో నెంబర్ 120 కూడా ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. 1980 సంవత్సర కాలంలో చట్టాల్ని కాపాడుకునే సందర్భంలో జిల్లాలో ఉన్నటువంటి ప్రజల్ని అనేక ఇబ్బందులకు గురి చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.1986 సంవత్సరంలో కూడా చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాలు పూనుకున్నాయని వారు అన్నారు. మరోసారి ఆదివాసులు అభివృద్ధి చెందారని ఏజెన్సీలో చట్టాల్ని వద్దని హైకోర్టుకెళ్లడం ఆదివాసి ప్రజల్ని మోసం చేయడమే అని అన్నారు, ఆదివాసి చట్టాలను కాపాడాలని ఏజెన్సీలో 5 వ షెడ్యూల్ ని ప్రతిష్టంగా అమలు చేసి రక్షించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాలలో ఏజెన్సీ చట్టాలని అధికారులు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వజ్జా నరసింహారావు, ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గగ్గుల రామకృష్ణ , అభ్యుదయ సంఘం భద్రాచలం ఉపాధ్యక్షులు కొరస చిన్నబాబు దొర, అభ్యుదయ సంఘం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ భద్రాచలం డివిజన్ నాయకులు ఎం చిట్టిబాబు, దాసరి సాయన్న, పిడిఎస్యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి డి సాయన్న, మునిగేలా శివ ప్రశాంత్, భద్రాచలం డివిజన్ అధ్యక్షులు దండగల రామ్ చరణ్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు కనుక ప్రణయ్ లు పాల్గొన్నారు.

## మొద్దులగూడెం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం

- కొత్త బోరుబావి మంజూరు చేసి నీటి ఎద్దడిని తీర్చిన ఎమ్మెల్యే జారే



**దమ్మపేట, ఆగస్టు 30(ప్రజాజ్యోతి):** మండలంలోని మొద్దులగూడెం ఎస్సీ కాలనీలో గత రెండు రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తక్షణమే స్పందించారు. కాలనీలో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కాలనీ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త బోరుబావి మంజూరు చేయించారు. అనంతరం బోరు వేసి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యేకు మొద్దులగూడెం ఎస్సీ కాలనీ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని వారు కోరారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ యు. వెంకన్నబాబు వార్షిక తనిఖీ



**ఆళ్ళపల్లి.ఆగస్టు30(ప్రజా జ్యోతి )** ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలోని ఆళ్ళపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఇల్లందు డీఎస్పీ యు. వెంకన్నబాబు ఆదివారం వార్షికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, వివిధ రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు.పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అప్రమత్తంగా పనిచేసి ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ బి. సత్యనారాయణ, ఆళ్ళపల్లి ఎస్‌హెచ్‌ఓ ఎం. సోమేశ్వర్ పాల్గొన్నారు.

## మేనిఫెస్టోపై రక్షణసేన ప్రచారం

- మందలపల్లి ప్రకాశ్‌నగర్‌లో గడపగడపకు వెళ్లిన నాయకులు



**దమ్మపేట, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించేందుకు అశ్వారావుపేట నియోజకవర్గం మంద లపల్లి ప్రకాశ్‌నగర్ కాలనీలో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సోడెం వెంకట్ ఆధ్వర్యంలో గడపగడపకు వెళ్లి మేని ఫెస్టోలోని ముఖ్య అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమం తదితర అంశాలపై వారితో చర్చించారు. కవిత ప్రవేశపెట్టిన 'భూ లక్ష్మి' పథ కం గురించి వివరించి, దాని ప్రయోజనాలను తెలియజేశారు. మేనిఫెస్టో అం శాలను ప్రతి కుటుంబానికి చేరవేసేందుకు నియోజకవర్గంలోని గ్రామాలు, కాలనీల్లో పర్యటిస్తున్నట్లు సోడెం వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో నాయకు లు, కార్యకర్తలు, మహిళలు, యువత, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువు పొడిగించాలి

- రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 30, (ప్రజా జ్యోతి)** చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం పొడిగించాలని రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా ప్రభుత్వాన్ని కోరారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ పక్క ఎస్ఐఆర్ లో పేర్లు లేకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరగడం, మరోపక్క చేయూత వెబ్ సైట్ లో సర్వర్ సమస్యల కారణంగా అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ,వితంతువు లు, దివ్యాంగులు,ఒంటరి మహిళలు తదితర అర్హులకు చేయూత పెన్షన్ జీవనాధారంగా ఉందన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే సర్వర్ సమస్యలను పరిష్కరించడంతో పాటు దరఖాస్తుల గడువును మరో 10 రోజుల పాటు పొడిగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

## ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి..

# యువతి అనుమానాస్పద మృతి

- దోషులను కఠినంగా శిక్షించాలి
- ఆదివాసీ సేన రాష్ట్ర సహాయ కార్యదర్శి ఊకే రవి





**ములకలపల్లి ఆగస్టు 30 (ప్రజాజ్యోతి):** ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన యువతి ఊకే శిరీష (21) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం మండలంలో విషాదం నింపింది. తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో నర్సుగా పనిచే న్న శిరీష మృతి చెందిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది.

**కుటుంబానికి అండగా నిలిచిన యువతి..**

శిరీష తండ్రి కొంతకాలం క్రితమే మృతిచెందగా, తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు సమాచారం. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లిన శిరీష.. నర్సుగా పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలిచింది. కుటుంబ బాధ్యతలను మోస్తూ ఉద్యోగం చేస్తూ ఆసరాగా నిలిచిన యువతి అనూహ్యంగా మృతిచెందడంతో చౌటిగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. మృతికి గల కారణాలను నిగ్గు తేల్చి, ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**దోషులను కఠినంగా శిక్షించాలి: ఊకె రవి**



శిరీష మృతివార్త తెలుసుకున్న ఆదివాసీ సేన రాష్ట్ర సహాయ కార్యదర్శి, న్యాయవాది ఊకే రవి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోరాడుతామని తెలిపారు. శిరీష మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఊకే రవి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, అధికారులు అండగా నిలిచి న్యాయం చేయాలని కోరారు

# చైర్మన్ పీఠమే లక్ష్యం...

- పదవీని కాపాడుకోవటమే ప్రస్తుత కర్తవ్యం
- మూడు నెలల ఒకసారి వస్తా సంతకం పెడతా వెళ్లిపోత
- అవిశ్వాసం పెట్టేంత వరకు ప్రస్తుతం నా పని ఇదే
- అసంతృప్త కౌన్సిలర్లను ఆకట్టుకోండని సన్నిహితులకు సందేశం
- వచ్చేది కెసిఆర్ ప్రభుత్వం మనం చేరేది బిఆర్ఎస్ లోనే... అంటూ సందేశం
- 23వ వార్డు మద్దతుదారులతో టచ్ లో ఉన్న కౌన్సిలర్..?
- కాంగ్రెస్ లో ఉంటూ కాంగ్రెస్ కే ఎసరు పెడుతున్న వైనం

**ఇల్లందు, అగస్ట్ 30(ప్రజా జ్యోతి)** నా రాజకీయ లక్ష్యం చైర్మన్ పీఠం ఎక్కడమే... అందుకే గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సైతం ఆ సీటు దక్కించుకునేందుకు కోట్ల రూపాయలు హెచ్చించాము. చివరి నిమిషంలో రాష్ట్ర ప్రభుత్వ మారడంతో ఒక్క అడుగు దూరంలో చేజారిపోయింది. ఈ సారి అలాంటి పరిస్థితి ఉండదు.. ఎలాగైనా పదవీకాలం ముగిసే సమయానికైనా చైర్మన్ పీఠంపై కూర్చోవడమే మా వ్యూహం అంటూ 23 వార్డు కౌన్సిలర్ తన అనుచర గణం, తనకు మద్దతు ఇచ్చిన స్థానికులతో చర్చిస్తున్నట్లు సమాచారం. జరుగుతున్న రాజకీయ పరిణామాలు చర్చలు వ్యూహాలు , సమాలోచనలు ప్రస్తుత పాలకవర్గంలో అంతర్గత విభేదాలు వీటన్నింటిని తన అనుచర ఘనం ద్వారా సేకరిస్తున్నట్లు సమాచారం వీరు సైతం కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీకి ద్రోహం చేస్తూ అమాయకుల క్యాంపు కార్యాలయం చుట్టూ తిరుగుతూ నమ్మిన నాయకులను పార్టీనికి రోహన్ తలపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. ఆనాడు ఎన్నికల సమయంలో లక్షల రూపాయలు తిన్నాము కాబట్టి ఆ రుణం తీర్చుకోవాలన్న లక్ష్యమే మాది అంటున్నారట.

### » పదవి కాపాడుకోవడమే నా ప్రస్తుత కర్తవ్యం...

ప్రస్తుతానికి నా పదవి కాపాడుకోవడమే నా ప్రస్తుత కర్తవ్యమని, నా గెలుపుకు సహకరించిన వారు ఎవరు చింతించవద్దని వార్డు ప్రజలు ఎన్ని రకాలుగా మిమ్మల్ని నిందించిన దూషించిన నన్ను ఏమన్నా ఎవర్ని ఏమనొద్దని సందేశాలు పంపిస్తున్నట్లు సమాచారం. మూడు నెలలకోసారి మున్సిపల్ కార్యాలయానికి వస్తా సంతకం చేస్తా.. వెళ్ళిపోతా అని....ఇప్పుడు పదవి కాపాడుకుంటేనే భవిష్యత్తులో చైర్మన్ పీఠంపై కూర్చోగలుగుతాం ప్రస్తుతం నేను చేస్తుంది ఇదేనని జోరుగా ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తుంది. భవిష్యత్తు అంతా మనదే ఆ పీఠంపై కూర్చొని అంతవరకు నిద్రపోయేది లేదని, గెలుపు కోసం సహకరించిన నా వెంట ఉన్న వారందరికి న్యాయం చేస్తా... ఇచ్చిన హామీలన్నీ నేరవేరుస్తా ఓటర్లకు ఎలాగో ఓటుకు డబ్బులు ఇచ్చాను ఇక మిగిలింది నన్ను నమ్ముకొని ఉన్న మీరందరికీ తగిన వారితోషకం ఇస్తాం ఎవ్వరు అధైర్య పడవద్దు.. బాధపడవద్దు అంటూ 23 వ వార్డులో ఫోన్ లో ధైర్యం చెబుతున్న తీరుపై తీవ్ర చర్చ జరుగుతుంది. కేవలం మద్దతు దారులకు,ఎన్నికల సమయంలో తన వెంట ఉన్నవారికి 23వ వార్డు కౌన్సిలర్ అందుబాటులో ఉంటూ ఇక్కడి సమాచారాన్ని సేకరిస్తుందట.

### » అసంతృప్తులను గుర్తించండి ఆకట్టుకోండి


ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గంలోని కౌన్సిలర్ల మధ్య సఖ్యత లోపించిందని, కొంతమంది కౌన్సిలర్లు ప్రస్తుత చైర్ పర్సన్ పట్ల అసంతృప్తిగా ఉన్నారని తాను కౌన్సిల్ కి వచ్చిన సందర్భాల్లో పలువురు కౌన్సిలర్లు తనతో చర్చిస్తూ మీరు ఉంటే కొంత ఆర్థికంగా మేము నిలదొక్కుకునేవాళ్ళమని ఎన్నికల్లో సొంతగా లక్షల రూపాయలు వేచ్చించామని ఇప్పుడు వాటికి వడ్డీలు కట్టలేకపోతున్నామని మీరు ఎప్పుడు చైర్మన్ అవుతారో అప్పుడు మా ఆర్థిక కష్టాలు పోతాయంటూ వారి సాధకబాదలను తనతో చెప్పుకున్నట్లు 23వ వార్డు కౌన్సిలర్ తన అనుచర గణంతో చర్చిస్తున్నారని ప్రచారం జరుగుతుంది. ఖర్చు ఎంత పెట్టారో.. మీకు అంత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఇది అసంతృప్తిగా ఉన్న కౌన్సిలర్ల దృష్టికి తీసుకువెళ్లాలంటూ తన గెలుపు కోసం కృషి చేసిన నమ్మకమైన వ్యక్తులకు ఈ బాధ్యత అప్పగించారని తెలుస్తుంది. ఈ క్రమంలోనే ప్రస్తుత పాలకవర్గం రెండుగా చీలినట్లు పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిందని జోరుగా ప్రచారం జరుగుతుంది.

### » వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే చేరేది టిఆర్ఎస్ లోనే..

కాలం కలిసి రాక బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చామే తప్ప అందులో చివరి వరకు కొనసాగేది ఏమీ లేదని గతంలోనే టిఆర్ఎస్ తరపున చైర్ పర్సన్ పదవి పొందాల్సి ఉండేదని సమయం కలిసి రాక దానికి దూరమయ్యామేనే తప్ప దానిపై ఆశ తీరలేదని 23వ వార్డు కౌన్సిలర్ తన అనుచరు గణం వద్ద వాపోతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, దీనిని గుర్తించి దానికి అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందని హితబోధనలు చేస్తున్నట్లు సమాచారం. ఎలాగైనా కెసిఆర్ ప్రభుత్వం వస్తుందని చివరికి మనం చేరేది బిఆర్ఎస్ లోనే చివరి సంవత్సరం కాలంలో చైర్మన్ పీఠంపై కూర్చోవడం ఖాయమని తన అనుచరులతో ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది.

### » కాంగ్రెస్ లో ఉంటూ ఆ పార్టీకే ఎసరు పెడుతుంది ఎవరు..?

కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకొని ఆ చైర్మన్ పీఠం దక్కకపోవడంతో ఆమెను అనుచరగళమంతా ఆందోళన, ఆవేదనలో నిండిపోయారు. ఈ క్రమంలో కౌన్సిలర్ భర్త పలు వివాదాల్లో చిక్కుకొని జైలు పాలైన విషయం ఇల్లందు ప్రజలకు తెలిసిందే. ఎలాగైనా ఆయనను బయటికి తీసుకురావడమే లక్ష్యంగా అందరు పనిచేయాలని వచ్చే ఎన్నికల నాటికి కచ్చితంగా మనం అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని 23వ వార్డులో తన గెలుపు కోసం కృషి చేసిన మీరంతా రేపు భవిష్యత్తులో తాము ఏ నిర్ణయం తీసుకున్న మా వెంట నడవాలి అంటూ సూచించినట్లు సమాచారం. తన భర్త బయటికి రాగానే మీ కష్టాలన్నీ తీర్చేస్తామని ప్రతి ఒక్కరు గుర్తు ఉన్నారని అంటూ ఎన్నికల సమయంలో తనకు సహకరించిన వారందరికీ హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది.







# తలొగ్గలేక తప్పుకున్నారు...

# తలొగ్గి పరువు తీశారు..





- నాటి శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి 'ఆత్మగౌరవ త్యాగాలు' ఎక్కడ?
- నేటి సూర్యనారాయణ, లలిత్ 'లొంగుబాటు నాటకాలు' ఎక్కడ?
- అధికారిక వేదికలు వదిలి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో సింగరేణి సమీక్షలేంటి?
- నిబంధనల ఉల్లంఘనపై అధికారుల సీడీఏ రూల్స్ ఏం చెబుతున్నాయి?
- పొలిటికల్ జోక్యాలకు తలొగ్గిన అధికారులపై తక్షణమే చర్యలకు నిలదీతలు!

**రాష్ట్రానికి వెలుగులు పంచే దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఉన్నతాధికార స్థానం అంటే కేవలం బాధ్యతలు నిర్వహించడం మాత్రమే కాదు.. అది వేలాది మంది కార్మికుల నమ్మకం, 137 ఏళ్ల సంస్థాగత స్వయంప్రతిపత్తి! కానీ నేడు ఆ అత్యున్నత అధికార హోదాను పొలిటికల్ లీడర్ల ముంగిట తాకట్టు పెడుతున్న తీరు నల్లబంగారు సామ్రాజ్యంలో తీవ్ర దుమారాన్ని రేపుతోంది.**

● భద్రాద్రి కొత్తగూడెం / సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి

ప్రస్తుత అధికారులు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో మోకరిల్లిన పరిణామంతో, నాడు సంస్థ గౌరవం కోసం నిలబడ్డ ఎన్.వి.కె. శ్రీనివాస్, జి. వెంకటేశ్వర రెడ్డి వంటి ఉన్నతాధికారుల ఆత్మగౌరవ చరిత్రను సింగరేణి వర్గాలు ఇప్పుడు మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నాయి.

**నాటి నిబద్ధత – ఆత్మగౌరవ పరిరక్షణ!**

సింగరేణి చరిత్రలో గతంలో పని చేసిన ఉన్నతాధికారుల తీరు సంస్థ స్వతంత్రతకు ప్రతీకగా నిలిచింది. గతంలో డైరెక్టర్ (పా) ఆపరేషన్స్ గా పనిచేసిన ఎన్.వి.కె. శ్రీనివాస్, ఆ తర్వాత డైరెక్టర్ (పా), ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ గా వ్యవహరించిన జి. వెంకటేశ్వరరెడ్డి వంటి అధికారులు ఎదురైన రాజకీయ ఒత్తిళ్లకు ఎంతమాత్రం లొంగలేదు. తమ విధుల నిర్వహణలో సంస్థాగత నిబంధనలు, ప్రొటోకాల్‌ను కాపాడేందుకే ప్రాధాన్యమిచ్చారు. రాజకీయ ప్రాభవం ముందు సంస్థ గౌరవాన్ని పణంగా పెట్టే పరిస్థితి వచ్చినప్పుడు, తమ పదవులను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డారే తప్ప పొలిటికల్ లీడర్ల ద్వారాల వద్ద తలవంచలేదు. ఇందులో భాగంగా జి. వెంకటేశ్వర రెడ్డి తన 6 నెలల పదవీకాలాన్ని వదులుకుని విఆర్ఎస్ తీసుకోగా, ఎన్.వి.కె. శ్రీనివాస్ డైరెక్టర్ స్థానం నుండి దిగివచ్చి సాధారణ జీఎంగా బాధ్యతలు నిర్వహించారు. "హోదా పోయినా పర్వాలేదు, సంస్థ ఆత్మగౌరవమే ముఖ్యం" అని నిలబడిన నాటి అధికారుల తీరు సింగరేణి చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది.

**నేటి ఆత్మసమర్పణ – లలిత్ కుమార్ పొలిటికల్ మార్క్!**

అయితే నాటి అధికారులు ప్రదర్శించిన ఆత్మగౌరవ బాటకు, నేడు ప్రస్తుత డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ ల వైఖరికి నడుమ కొండంత తేడా కనిపిస్తోంది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తన సొంత క్యాంప్ కార్యాలయానికి పిలిపిస్తే, నిబంధనలను పక్కనబెట్టి అధికారులు అక్కడ వాలిపోయి సమీక్షల్లో కూర్చోవడం లొంగుబాటు ధోరణికి పరాకాష్ట గగ మారింది . అయితే ఇక్కడ ప్రధానంగా ఆర్జీ-1 జీఎంగా ఉన్న లలిత్ కుమార్ పై రాజకీయ ప్రభావం ఎక్కువగా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతను చిన్న స్థాయి రాజకీయ జోక్యాలకూ కూడా ఎక్కువగా లోబడుతున్నాడని, అసలు డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లడానికి జీఎం లలిత్ కుమార్ ప్రోద్బలమే ఎక్కువగా ఉందనే ప్రచారం నడుస్తోంది. దీంతో అతని తిరుపైన పలు విమర్శలు వినబడుతున్నాయి. అయితే సీఎండీ, బోర్డు అధికార యంత్రాంగం అందుబాటులో ఉన్నప్పటికీ వ్యక్తిగత గడప తొక్కి సమీక్షలు జరపడం ద్వారా సంస్థ స్థాయిని దిగజార్చారని కార్మిక వర్గాలు మండిపడుతున్నాయి.

**సీడీఏ నిబంధనల ప్రకారం తప్పించాల్సిందే!**

సింగరేణి ఎగ్జిక్యూటివ్‌లకు వర్తించే 'కండక్ట్, డిసిప్లిన్ అండ్ అప్పీల్' (సీడీఏ) రూల్స్ ప్రకారం అధికారులకు పొలిటికల్ న్యూట్రాలిటీ (రాజకీయ తటస్థత), నిష్పాక్షికత, జవాబుదారీతనం అత్యంత ప్రధానమైనవి. ఏ అధికారి కూడా తన విధులపై ప్రభావం చూపగల బయటి రాజకీయ శక్తులకు లొంగి ఉండకూడదు. ఈ నిబంధనల వెలుగులో చూస్తే.. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన రివ్యూ అసలు ఏ అధికారిక వ్యవస్థ పరిధిలోకి వస్తుంది? సమావేశానికి అధికారిక ఎజెండా ఉందా? సీఎండీ అనుమతి ఉందా? మినిట్స్ నమోదయ్యాయా? అనే ప్రశ్నలకు యాజమాన్యం జవాబు చెప్పాల్సి ఉంది. నిబంధనావళిని విస్మరించిన అధికారులపై సీడీఏ నిబంధనల ప్రకారం వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కార్మిక వర్గాలు, పలువురు అధికారులు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

**ఆ అధికారులను తొలగించకపోతే ఆందోళనలు: హెచ్ఎమ్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్**

"ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి మోకరిల్లిన అధికారులను తక్షణమే విధుల్లోంచి తొలగించాలి. 137 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి కాలరీస్‌లో మునుపెన్నడూ ఇంతటి ఘోరమైన పరిణామం చోటు చేసుకోలేదు. ఉన్నత హోదాలో ఉన్న డైరెక్టర్, జీఎం స్థాయి అధికారులు చట్టబద్ధమైన ప్రొటోకాల్‌ను బూట్ల కింద తొక్కిపట్టి ఒక రాజకీయ నాయకుడి ముందు ఆత్మసమర్పణ చేసుకోవడం సంస్థకే పరాభవం. ఇటువంటి లొంగుబాటు వైఖరి వల్ల సింగరేణి పరిపాలనలో రాజకీయ జోక్యాలు తీవ్ర స్థాయిలో పెరిగిపోతాయి. లొంగిపోయిన అధికారులను యాజమాన్యం తక్షణమే బాధ్యతల నుంచి బర్తరఫ్ చేయకపోతే సింగరేణి వ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతాం"



